# 31. లాంగ్ లాంగ్ కవిత్వం

"మా పత్రిక అమ్మకాలు పెరిగేందుకు కాసిన్ని చిట్కాలు చెప్పండి సార్!" అనడిగేడో సంపాదక మిత్రుడు.

"ఏముంది? అమ్మటమే!" అన్నాన్నేను.

"మేం అమ్ముతూనే ఉన్నాంగానీ ఆటకమీద దాచుకోవటంలేదు సార్! కానీ, జనం మా పత్రికని బియ్యం, కిరసనాయిల్ కొన్నంత ఆసక్తిగా క్యూల్లో నిలబడి కొనటం లేదు!"

"ఇప్పుడే మాత్రం అమ్ముడవుతోంది?"

ఆయన ఇబ్బందిగా మొహం పెట్టేడు. పది నిముషాల పాటు సీరియస్‌గా ఆలోచించేడు అమెరికన్ సి. ఐ. డి. ని రష్యన్ సి. ఐ. డి. చూసినట్టుగా నన్ననుమానంగా చూస్తూ "ప...ఫ...ఫ్ఫదివేలనుకోండి" అన్నాడు.

"అంటే నిజంగా అయిదువేలన్నమాట. ఫర్వాలేదు గానీ పాతిక వేలెందుకు అమ్ముడు పోవటం లేదూ?" అని ఆరా తీసేను.

"తెలుగు వాళ్లు తెలివి మీరిపోయేరు సార్!"

"అంటే?"

"కోపగించుకోకండి సార్! రోజులు మారిపోయేయి. చదువురాని వాళ్ళు కూడా ఇప్పుడు కథలూ, కవితలూ రాసి మా మొహాన్న కొడుతున్నారు."

"మంచిదేగదా! వెనక ఓ కవి సమ్మేళనంలో కవిత విని ఓ మిడిల్ స్కూల్ కుర్రాడు 'ఓస్! కవిత్వం అంటే ఇదేనా! ఈ మాత్రం నేనూ రాయగలను' అన్నాట్ట!"

"నిజమేనండీ! కానీ, వచ్చిన ఇబ్బందేమంటే ఈ లెక్కన తెలుగు వచ్చినవాళ్ళూ, రాని వాళ్ళూ అందరూ రాసి పారే స్తున్నారు. మన రచయితలకో రోగం ఉంది. వాళ్ళు తమ రచనలు తప్ప మరెవరివీ చదవరు! అందువల్ల పత్రికలూ కొనరు! మరి మన పత్రిక అమ్ముడు పోవటం ఎలా?" అని వాపోయేడాయన.

నిజమే కావచ్చు ననిపించింది. పూర్వం నేనో పత్రికను ఎడిట్ చేస్తుండగా మా పోస్టుమేన్ రోజుకు రెండుసార్లు చొప్పున రెండేసి కిలోల సాహిత్యం నా నెత్తిన పారేసి విసుక్కుంటూ పోతుండేవాడు. అవన్నీ చూస్తుంటే ఈ రాసే వాళ్ళంతా మన పత్రికను కొంటూంటే సర్క్యులేషన్ ఈజీగా పాతిక వేలయి పోవును గదా! అనిపించేది. కానీ, అలా జరగా లంటే అవన్నీ చదవకుండానే అచ్చుకివ్వాలి. అచ్చెయ్యాలంటే మా పత్రిక్కి స్వతంగా ఓ న్యూస్ ప్రింట్ ఫ్యాక్టరీ ఉండాలి. అది జరిగే పనిగాదు.

అందుకని ఓ ప్రకటన చేసేను. "ఓ తెలుగు రచయితలారా! మా పత్రికకు గ్రేట్‌వాల్ ఆఫ్ చీనాలాంటి పెద్ద పెద్ద కథలూ, లాంగ్ మార్చ్‌లాంటి పొడుగాటి కవితలూ పంపి నా దుంప తెంపకండి. అచ్చులో ఓ పేజీకి మించని కవితలై తేనే చదవబడుతాయి. లేకుంటే పకోడీల దుకాణానికి హోల్ సేల్‌గా చేరుకుంటాయి" అని.

దాంతో కవి కుమారులూ, కవి వృద్ధులూ అంతా కలసి ఏకగ్రీవంగా నా మీద యుద్ధప్రకటన చేసేరు. "ఒరే! ఎడిటరూ! ఏమిరా నీ పొగరు? కవితనిట్లు చిన్నచూపు చూసెదవా? అకటా! అధునిక తెలుగు కవిత నీ బోడిపత్రికలో ఓ పేజీని దాటి మించి ఎదగలేదనియా నీ యుద్దేశ్యము. ఓరీ! బూర్జువా రోగం పత్రికా సంపాదకాధమా! నీ నిర్ణయమును పునరాలోచించుకొమ్మి. మా అధునిక చాంతాడు కవితా సీత పాలిటి రాముడవు కాకుము!" అని ఓ అల్టిమేటం ఇచ్చేరు.

అది చూసి మా ప్రింటర్ అండ్ పబ్లిషర్‌గారు హడలిపోయేరు. "పిళ్ళతో మనకు తగాదా ఎందుకు సార్! ఆ వచ్చినవన్నీ కట్టగట్టి గవ్‌చిప్‌గా తూకం వేసేసి అమ్ముకుంటే మనకు రోజూ మధ్యాహ్నం కాఫీ ఖర్చుండదు గదా, ఈ ప్రకటన లెందుకు?" అని నన్ను మందలించేరు.

అందుమీదట నేను మరలా ఓ ప్రకటన వేసేను. "మన కవియోధుల ఐక్య సంఘటన తరపున మాకందిన అప్పీలును

గురించి లోతుగా ఆలోచించగా వారి వాదము సబబేననిపించినది. అంత గొప్ప కవితలను భరాయించగల శక్తి మా పత్రికకు లేదని మనవి చేస్తూ, అసలు మేమికపై కవితల జోలికే రాదలచలేదని ప్రకటించదలచాం. కనుక మాకు పేజీ సైజు కవిత్వం కూడా పంపకండి'' అని.

ఈ సంగతి మా సంపాదక మిత్రుడికి వివరించేను. "ఆధునిక కవిత్వం విరివిగా అచ్చు గుద్దండి. అదే అమ్ముడవుతుంది!'' అని సలహా ఇచ్చేను.

అతనీసారి రత్యాకేసి అనుమానంగా చూసే అరబ్బులా నావంక చూసేడు. ''నన్ను దివాలా తీయించాలని ఉందేమిటి సార్! ఈ కవిత్వం పేజీ సైజేగాదు, కనీసం అరపేజీ సైజుక్కూడా ఎదగలేదు. అది అచ్చేస్తే నేను చదూకోవాల్సిందే తప్ప రాసినవాడు కూడా కొనడు!" అన్నాడు.

"పోనీ, ఉత్తమ నవలలు కొన్ని ప్రచురింప గూడదూ! సీరియల్స్ ఉంటే జనం కూడా పత్రికను సీరియల్‌గా చదువుతారు గదా!'' అన్నాను.

"నిజమేనండీ కానీ, అది ఖర్చుతో కూడిన పని. మంచి నవలలన్నీ పెద్దపెద్ద పైగ్రిజులిచ్చేవాళ్ళే కొట్టేస్తున్నారు! అవి మనదాకా రావు."

సంగతర్థమయింది నాకు.

'అయితే భాగవతం సీరియలైజ్ చేయండి. ఖర్చూ ఉండదు. బూతులు వేసినటూ ఉండదు " అన్నాను.

"మీరు రచయితలే గదా! పత్రికలు సరిగా చదువుతున్నట్టు లేరు. మన పత్రికల్లో ఆధునిక భాగవతాలు చాలా వచ్చాయండి! ఇప్పుడా పాత భాగవతం ఎవరూ చదవరు!" అన్నాడాయన.

"మనలో మాట. అసలింతకీ పత్రిక నడపటంలో మీ ఉద్దేశ్యం ఏమిటీ?" అని సూటిగా అడిగేస్నేను విసుగెత్తి.

ఆయనోసారి మావోను కలిసినప్పుడు కృశ్చేవ్ చూసినటు భయం భయంగా చూసేడు.

'ఎబ్బే! ఏదో కాస్త సాహిత్య సేవ చేద్దామనీ, అజ్ఞాన ప్రజల్నుద్ధరిద్దామనే తప్ప మరే ఉద్దేశ్యం లేదండి!" అన్నాడు.

'అలాగయితే ఉత్తమ సాహిత్యం వేయండి! వేరే ఆలోచనెందుకూ?'

'అదేనండీ! అసలు సమస్యా! ఉత్తమ సాహిత్యం ఏదో తెలియటమూ లేదు. అలాంటిదేదీ మాదాకా వచ్చి చావటమూ లేదు!"

'ఈ సమస్యను పరిష్కరించటం ఏమంత కష్టంకాదు. ఓ వారం రోజులుపాటు బియ్యంకోసం, కిర్సనాయిల్ కోసం క్యూల్లో నుంచున్నవాళ్ళను సర్వే చెయ్యండి, వాళ్ళెలాంటివి

కావాలంటే అదే అచ్చెయ్యండి మీ సర్క్యులేషన్ పెరిగి తీరుతుంది" అన్నాన్నేను.

'అదికూడా అయ్యిందండీ! వాళ్ళంతా ఏకగ్రీవంగా ఒకటే చెప్పారు.

"ఏమిటది?"

'వాళ్ళకు ఇష్టం అయినది బియ్యంఅట. వాళ్ళకు అర్జంటుగా కావాల్సింది కవిత్వం కాదు. కిరసనాయిలట!"

'ఘోరం! తెలుగువారి సాహిత్యాభిలాష ఇంతగా పతనమైందా?'

"నాకేం సలహా ఇస్తారు సార్?"

'నాయనా! నువ్వు పత్రిక సంగతి మరచిపో! న్యూస్ ప్రింట్ బ్లాకులో అమ్ముకుని బాగుపడు. అర్జంటుగా ఓ దుకాణం పెట్టు! అక్కడ క్యూలో నుంచునే ప్రజలకు మన కవికుమారుల ప్రబోధ గీతాల్ని వినిపించమను. ఆ ఛాన్స్ ఇప్పించినందుకు మన కవిగాళ్ళ నుండి గంటకింత అని చార్జి చెయ్. అర్నెల్లలోగా నువ్వు మరో మేడగట్టి అందులో మాకు మంచి పార్టీ ఒకటి తగలెయ్!"

ఆ తర్వాతేమయిందోగాని నాకా పత్రిక మాత్రం అందటం ఆగిపోయింది.

(మే 1974)